# చిటికెలో చిరునామా

## ● టీహెచ్ కోడ్‌ను ఆవిష్కరించిన తెలుగు శాస్త్రవేత్త



ఈనాడు, హైదరాబాద్

కొత్త ప్రదేశంలో చిరునామా కనుక్కోవడం ఎంత కష్టమో అందరికీ అనుభవమే. గూగుల్ మ్యాప్స్ వచ్చాక చాలా వరకు సులభతరం అయినా.. కొన్ని పరిమితులు ఉన్నాయి. పోస్టల్ చిరునామాలన్నింటినీ ఇందులో గుర్తించలేం. ఒకే పేరున్న ప్రాంతాలు వేర్వేరు చోట్ల ఉన్నప్పుడు తెలుసుకోవడం కొంచెం కష్టమే. పైగా ఇది జీపీఎస్ కచ్చితత్వంపై ఆధారపడి ఉంటుంది. ఇలాంటి ప్రతికూలతలను అధిగమిస్తూ.. కచ్చితమైన చిరునామాను కనుక్కొనే కొత్త మార్గాన్ని తెలుగు శాస్త్రవేత్త హరినారాయణ తన బృందంతో కలిసి అభివృద్ధి చేశారు.

### 16 అంకెల నుంచి 8కి కుదింపు..

ప్రపంచంలో ఏదైనా ప్రదేశాన్ని కచ్చితత్వంతో గుర్తించేందుకు అక్షాంశం, రేఖాంశాలను ఉపయోగిస్తుంటారు. వీటితో ఆయా ప్రదేశాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించవచ్చు. అయితే 16 డిజిట్స్ ఉంటే వీటిని గుర్తుంచుకోవడం వీలుండి. ఇది ఎవరికైనా చాలా కష్టం. శాస్త్రవేత్తలు, ప్రభుత్వ కార్యాలయాల్లోని రికార్డుల్లో ఇలా పరిమితంగానే వీటిని వాడుతుంటారు. సులభంగా గుర్తించేందుకు వీలుగా కాలనీ, ఊరు, జిల్లా, రాష్ట్రం పేర్లతో పిలుస్తుంటారు. ఆ 16 డిజిట్స్‌ను 8 అంకెలకు కుదించి టీహెచ్ కోడ్‌ను తీసుకొచ్చారు హరినారాయణ. దీనిపై పేటెంట్ పొందారు. కేంద్రం యుక్తి కార్యక్రమం కింద వినూత్న ఆవిష్కరణలకు పిలుపునివ్వగా 20 వేల దరఖాస్తులు వచ్చాయి. వాటిని మూడు విడతల్లో వడపోయగా మిగిలిన 20 సంస్థల్లో 'టీహెచ్ కోడ్' ఒకటిగా నిల్చింది. ఇక్కడ టీహెచ్ అంటే హై టెక్నాలజీ అని అర్థం. తిరగేసి పెట్టారు. చెన్నైలోని బి.ఎస్.అబ్దుల్ రెహమాన్ క్రిసెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని సెంటర్ ఆఫ్ ఎనర్జీ డైరెక్టర్ టి.హరినాయణ ఆధ్వర్యంలో పీతాంబర్ సాయి గోయల్, ఎన్.రాజేంద్రన్ విద్యార్థుల బృందం ఈ యాప్‌ను అభివృద్ధి చేసింది. గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### ఎలా పనిచేస్తుంది?

"అక్షాంశం, రేఖాంశం, నార్తింగ్స్, ఈస్టింగ్స్ సంఖ్యలను సాధారణ ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌గా మా యాప్ మారుస్తుంది. జియో స్పేషియస్ డిజిటల్ టెక్నాలజీ సహాయంతో దీన్ని అభివృద్ధి చేశాం. ప్రపంచంలోనే ఈ తరహా ఇదే మొదటిది. యాప్‌లో మ్యాప్స్ తెరిచాక మీ ఇంటి, లేదా చేరుకోవాల్సిన చిరునామాపై తాకగానే టీహెచ్ కోడ్ వస్తుంది. ఈ కోడ్ మొబైల్ నంబర్ల మాదిరే నిక్షిప్తం చేసుకోవచ్చు. టీహెచ్ కోడ్‌ను గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం చేశాం. క్యాబ్స్, డెలివరీ యాప్స్, కొరియర్ సంస్థలతో చర్చించబోతున్నాం. వారు ఈ యాప్‌ను ఇంటిగ్రేట్ చేసుకుంటే కచ్చితంగా మీరున్న చోటుకే డెలివరీ చేసేందుకు వీలవుతుంది. ఇప్పటికే మా యాప్‌ను పలువురు ఉపయోగిస్తున్నారు.

-టి.హరినారాయణ

ఈనాడు హైదరాబాద్
మరిన్ని నగరవార్తలు 5, 6, 7, 8 పేజీల్లో